# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-03-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.**
2. **దేశంలోనే అత్యుత్తమ ప్రమాణాలతో రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ అధికారులకు సూచించారు.**
3. **పియం అజయ్ పథకానికి సంబంధించిన చెక్కులను శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఈరోజు పంపిణీ చేశారు.**
4. **భూగర్భ జలాల నియంత్రణ చట్టం-వాల్టాను చిత్తూరు జిల్లాలోని 18 గ్రామాల్లో అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

==========================

దేశవ్యాప్తంగా రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా సమాజంలో శాంతి, సామరస్యాన్ని తీసుకురావాలని, ఈ పవిత్ర మాసం కరుణ, దయ, సేవ విలువలను మనకు గుర్తు చేస్తుందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలతో చేసే ప్రార్ధనలు ఫలించాలని, భగవంతుని దయతో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా అన్నారు.

మరోవైపు ఉపవాస దీక్షలు చేసే వారికి అల్లా దీవెనలు ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ రంజాన్ ఉపవాస దీక్షలు మొదలైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం జాతీయ,అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ విధానాలను పరిశీలించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. దేశంలోనే అత్యుత్తమ ప్రమాణాలతో రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమ అమలుకు చేపట్టాల్సిన చర్యలపై విద్యా శాఖ అధికారులతో గుంటూరు జిల్లా ఉండవల్లి లో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యలో

మార్పులు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెరుగుదల తదితర అంశాలపై చర్చించేందుకు గవర్నర్ నేతృత్వంలో యూనివర్సిటీ ఉపకులపతులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమీక్షలో రాష్ట్ర పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరక్టర్ విజయరామరాజు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---------------------------

మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ పథకం–పీఎంఎజెవైకు సంబంధించిన చెక్కులను ఈరోజు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని వెలుగు కార్యాలయంలో స్థానిక శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని 4 మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు జీవనాధారం మెరుగుపరచుకోవడానికి చెక్కులను అందించామన్నారు. మహిళా అభ్యుదయానికి కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తూ...

వాయిస్– 24 సెకన్లు

---------------------------

నీటి సంరక్షణను ప్రోత్సహించేదమే లక్ష్యంగా రూపొందించిన భూగర్భ జలాల నియంత్రణ చట్టం–వాల్టాను చిత్తూరు జిల్లాలోని 18 గ్రామాల్లో అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిమితికి మించి భూగర్భజలాల వినియోగం, భూగర్భ జలవనరులు, వాటి వృద్ధి తదితర అంశాలు పరిశీలించి జిల్లా నీటి ఆడిట్ వివరాలను జిల్లా భూగర్భ జలశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వాటి ఆధారంగా ఎనిమిది మండలాల పరిధిలోని 18 గ్రామాల్లో వాల్టా చట్టాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఈ గ్రామాల్లో తాగునీటి అవసరాలకు తప్ప మిగిలిన ఏ ఇతర అవసరాలకు బోర్లు వేయరాదని, చట్టాన్ని అతిక్రమించి ఎవరైనా బోర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

---------------------------

జనరిక్ ఔషధాల గురించి అవగాహన పెంచదానికి, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడానికి మార్చి మొదటి వారాన్ని కేంద్ర ప్రభుత్వం జన్ ఔషధి సప్తాహ్‌గా నిర్వహిస్తోంది. ఈ వారోత్సవాలలో భాగంగా జనరిక్ ఔషదాలపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తారు. 2019లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం జనరిక్ ఔషధాల వాడకం గురించి ప్రజలకు తెలియజేయడం, తక్కువ ఖర్చుతో కూడిన అధిక–నాణ్యత గల ఔషధాల గురించి అవగాహన కల్పిస్తుంది. దీని ప్రయోజనాలను జనరిక్ ఔషధ కేంద్ర నిర్వాహకులు ఈశ్వర్ వివరిస్తూ...

వాయిస్– 37 సెకన్లు

---------------------------

లింగంపల్లి–విజయవాడ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు మరొక ఏసీ చైర్‌కార్‌ను అదనంగా జత చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. విజయవాడ నుంచి లింగంపల్లి,,, లింగంపల్లి నుంచి విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో అదనపు చైర్‌కార్ 15రోజుల పాటు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

---------------------------

భారత కోకిల సరోజినీ నాయుడు వర్ధంతి ఈరోజు. 1879 ఫిబ్రవరి 13 తేదీన హైదరాబాద్‌లో జన్మించిన ఆమె మహిళా విద్యపై అనేక ఆంక్షలు వున్న ఆ రోజుల్లోనే ఉన్నత విద్యను అభ్యసించారు. మహిళా విద్య కోసం, అంటరానితనం నిర్మూలన కోసం అవిరళ కృషి చేశారు. స్వతంత్ర భారత తొలి మహిళా గవర్నర్‌గా సేవలందించిన ఆమె 1952వ సంవత్సరం కాన్పూర్‌లో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షురాలుగా వ్యవహరించారు. సరోజినీ నాయుడు రచించిన "యాంకిలేట్ బెల్స్" అనే గ్రంథం అనేక విద్యాలయాల్లో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడం విశేషం. 1949 మార్చి 2న ఆమె తుది శ్వాస విడిచారు. సరోజిని నాయుడు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆమె జయంతి... ఫిబ్రవరి 13 ను జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది.

---------------------------

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లోని అన్ని న్యాయస్థానాలలో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహిస్తామని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె. రత్న ప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. గత డిసెంబర్ నెలలో జరిగిన లోక్ అదాలత్‌లో 5 వేల 616 కేసులు పరిష్కారం చేశామని వివరిస్తూ..

వాయిస్...32 సెకన్లు

---------------------------

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గుంటూరు ఏసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఇన్‌ఛార్జ్‌లు, పర్యవేక్షణ అధికారులకు నిన్న శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ చెల్లుబాటయ్యే ఓట్లు, చెల్లని ఓట్లకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి.శేఖర్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 25 సెకన్లు....

=====================